# పునరపి జననం

"ఏమిటి నాన్నా నువ్వనేది?" అన్నది కాంతం సూరికి దగ్గరగా జరిగి. వాడు మాట్లాడలేదు. వెల్లకిలా చాప మీద పడుకుని వున్నాడు. చేతులు రెండూ గుండెలమీద పెట్టుకుని ఎదురుగా గోడకేసి చూస్తున్నాడు. వాడి ముఖం లోకి చూసేసరికి అక్కడ ఏదో అర్థంకాని భావన కనబడింది కాంతానికి.

"ఏమిటి బుజ్జీ అంటావు? అలా వున్నావేం నాన్నా?" అన్నది మళ్ళీ. వాడిందాకా మెల్లిగా అన్నాడు ఒకమాట. అది తనకి స్పష్టంగానే వినబడింది. వెంటనే భయం వేసింది.

"నాకు చాలా విసుగ్గా వుంది— ఎన్నాళ్ళింకా?" అన్నాడు వాడు. వాడి పసి కంఠంలోంచి వినబడిన యీ మాట ముందు అర్థంకాలేదు కాంతానికి. అందుకే మళ్ళీ అడిగింది, "ఏవిటినాన్న నువ్వనేది?" అని. వాడు అమ్మవంక ఒకసారి కళ్ళు మందంగా త్రిప్పిచూసి, కళ్ళు మూసుకున్నాడు. "నిద్రొస్తోంది" అన్నాడు.

అవతల పనున్నదని లేచి వెడదామనుకున్న కాంతం వాడిమీద చేయివేసి పడుకుంది. వాడు నిద్రపోయాడు.

✣ ✣ ✣ ✣

"రంగనాథం! రంగనాథం!" అని అరిచాడు గుమ్మంలో నిలబడి అరటిపండు తింటున్న సూరి. సందులో గొడుగు, చెప్పులు వేసుకుని వెళుతున్న డెబ్భైఏళ్ళ మనిషి వెనక్కి తిరిగి చూశాడు. తనని పిలిచిన యీ ఆరేళ్ళ కుర్రాడిని చూసి, ఆయన తెల్లబోయి ఆగాడు. "రంగనాథం, మాట! ఈ వూళ్ళో వుంటున్నావా యిప్పుడు?" అన్నాడు సూరి. ఆయన వెనక్కి వచ్చాడు. ఆశ్చర్యంతోపాటు నవ్వు వచ్చింది.

"ఏమిటోయి బాబూ, బొడ్డుకోసి పేరెట్టినట్టు పిలుస్తున్నావు? నా పేరు నీకెలా తెలుసు?" అన్నాడాయన.

"నువ్వు తెలియదా నాకు? తెలుసు. కంకిపాడులో హోటలు పక్కసందులో—" సూరి అడిగాడు ఆయన్ని. రంగనాథం గొడుగు మడిచి, అరుగు వేపుకి రెండడుగులు వేసి, దగ్గరకొచ్చాడు. "ఏలెడున్నావో లేదో ఏమిటి యిట్టా మాట్లాడుతున్నావు?" అన్నాడు.

సూరి పండు తొక్క అక్కడ పారేసి, గబుక్కున ఎటో పారిపోయాడు. రంగనాథం కొంచెంసేపు నిలబడి

లోపలికి చూశాడు. ఎక్కడా మనిషి అలికిడి లేదు. తన దోవన తను వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం మళ్ళీ ముసలాయన ఆ యింటి గుమ్మం ముందు నుంచి వెడుతున్నాడు పగలంతా తన పనులు జూసుకొని. గుమ్మం దగ్గరకు వచ్చేసరికి ప్రొద్దుటి సంగతి గుర్తొచ్చి యింట్లోకి తొంగి చూశాడు, సూరి కనబడ్డాడు. “ఒరేయ్ బాబూ! ఏయ్! ఇల్లారా అబ్బాయీ:” అని పిలిచాడు. సూరి బయటకు వచ్చాడు. రంగనాథాన్ని చూసి నవ్వాడు.

“నన్నెట్టా ఎరుగున్నావురా నువ్వు! పేరెట్టి పిలిచావు?” అన్నాడు రంగనాథం.

“ఏమో- ఎప్పుడు పిలిచాను? పిలవలే!” అన్నాడు సూరి.

“అదికాదు, మాట” అని రంగనాథం పట్టుకోబోతుంటే లోపలికి పారిపోయాడు సూరి.

రంగనాథం బయలుదేరాడు ఏమీ చేయడానికి లేక. కంకిపాడులో హోటలు పక్క సందులో యిల్లు అలమేలుది. తను అక్కడికి వెళ్ళిన సంగతి ఆ ప్రులెవరికీ తెలియదని రంగనాథం ఉద్దేశ్యం. రోజుల తరబడి యింజనీరుగారి క్యాంపు పేరు చెప్పుకొని తను అలమేలు యింట్లో వున్న సంగతి భార్యకి కూడా ఆమె చివరి రోజులవరకూ తెలియదు.

అదంతా పదిహేనేళ్ళనాటి కథ. ఆ అలమేలూ లేదు, ఆనాటి తన స్నేహితులూ లేరు.

ఇన్నాళ్ళకి యీనాడు భూమికి రెండడుగుల ఎత్తు కూడాలేని యీ గొట్టికాయ తనని నిలవేసి, ఆ సాదులోకి వెళ్ళేవాడివి కదా అంటాడు. అర్థం కాక, నిట్టూర్చి నడక సాగించాడు రంగనాథం. మళ్ళీ మర్నాడు ఆ వీధి వెంబడి వెడుతున్నాడు. వెడుతూ ఆ యింటిముందు ఆగాడు. సూరి లోపల్నించి పరుగెత్తుకొచ్చి "రంగనాథం! నన్ను పట్టుకుంటావా?" అన్నాడు. అని నవ్వుతూ దగ్గిరికొచ్చేశాడు. జేబులో చెయ్యిపెట్టి రంగనాథం "మాటు! నీకు అణాయిస్తాను, కొనుక్కోవడానికి" అన్నాడు.

వాడిని దగ్గరగా తీసుకుని అరుగుమీద కూర్చోబెట్టుకుని "కంకిపాడు నువ్వు ఎప్పుడు వెళ్ళేవాడివిరా?" అన్నాడు.

సూరి తలవంచుకున్నాడు. "ఎప్పుడో! నువ్వు అలమేలు యింటికి వెళ్ళేవాడివిగా?– అక్కడ హోటల్లో కాఫీ త్రాగడానికి రోజూ వచ్చేవాడివిగా? నేనూ వున్నాను అక్కడ. "రంగనాథం ఆశ్చర్యానికి అంతులేదు. జేబులోంచి నిజంగానే డబ్బు తీసి వాడి చేతుల్లో పెట్టాడు.

"మీ నాన్నగారున్నారురా? పిలుచుకురా" అన్నాడు.

సూరి అలాగే కూర్చున్నాడు. డబ్బువంక చూడలేదు, లేవలేదు.

"హోటల్లో ఎక్కడ వుండేవాడివి?"

"నేను బెజవాడ నుంచి వచ్చేవాడిని. బెజవాడలో బట్టల దుకాణం- మూటలు తెచ్చి కంకిపాడు దుకాణాల్లో వేసేవాడిని" అని గడగడ సూరి చెబుతుంటే రంగనాథం చేతులు, కళ్ళు అప్పగించి కూర్చున్నాడు. ఏమీ బదులు చెప్పడానికి తోచనంత ఆశ్చర్యంలో పడిపోయాడు.

ఈ స్థితిలో లోపలినుంచి కామేశ్వర్రావు వచ్చాడు. కొడుకు ఎవరో ముసలాయనతో కూర్చుని వుండడం చూచి "ఎవరు కావాలండీ?" అన్నాడు

రంగనాథం లేచి నిలబడి, ఉత్తరీయం సవరించుకొని, "మీ అబ్బాయండీ!" అన్నాడు.

"ఔను. మీకెవరు కావాలి? ఇక్కడ కూర్చున్నారు?" అన్నాడు మళ్ళీ కామేశ్వర్రావు.

"ఎవరి కోసమూ కాదు. ఈ కుర్రాడు నన్ను పేరుపెట్టి కేకేస్తే వచ్చాను. వీడికెన్నేళ్ళు!"

"ఏడో ఏడు" అని, కొత్త మనిషి కదా, కుర్రాడిని గురించి ప్రశ్నలెందుకు అడుగుతున్నట్లు అని చూశాడు కామేశ్వర్రావు.

తమాషాగా మాట్లాడుతున్నాడండి వీడు. పదిహేనేళ్ళ క్రితం నేను కంకిపాడు వెళుతుండేవాడిని. ఆ సంగతి తెలుసనీ, తనకి బెజవాడలో బట్టల దుకాణం వుందనీ అంటున్నాడు—" అన్నాడు రంగనాథం.

"మీరనేదేమిటో నాకు బోధపడటం లేదు. బట్టల దుకాణమేమిటి?"

"వాడినే అడగండి."

బుర్ర వంచుకొని తండ్రి వంకైనా చూడకుండా లాగూ కొస పట్టుకున్న సూరి వంక చూశాడు కామేశ్వర్రావు. "ఏరా, ఏమిటి అంటున్నావట యీయనతో?" అన్నాడు. సూరి తలెత్తాడు, "ఏమిటి అంటున్నావుట. మాట్లాడవేం?" అని గట్టిగా రెట్టించాడు కామేశ్వర్రావు. బిత్తరపోయి బిగ్గరగా ఏడ్చాడు సూరి.

"అయ్యో, పిల్లాడిని కోప్పడకండి" అని రంగనాథం సవరించబోతోంటే— "ఛో వెధవా లోపలికి, ముది మాటలూ ముది వేషాలున్నూ," అని మళ్ళీ కసిరాడు కామేశ్వర్రావు. ఏడుస్తూ లోపలికి వెళ్ళాడు సూరి.

రంగనాథం యీ సంఘటన చూసి గుటక మ్రింగాడు. "ఏం చెప్పాడు మా వాడు ఇంకా?" అని కామేశ్వర్రావు తనతో మామూలుగా మాట్లాడేసరికి తేరుకున్నాడు.

"చాలా చిత్రంగా మాట్లాడాడు. నేను కంకిపాడులో సినిమా దగ్గర హోటలుకి కాఫీ తాగడానికి వెళ్ళేవాడిని. ఆ ప్రక్క సందులోకి వెళ్ళే వాడిని. అక్కడికి బట్టల మూటలు పుచ్చుకొని నాగభూషణం అనే వాడు బెజవాడ నుంచి వచ్చేవాడు. వాడు చనిపోయి ఏడెనిమిదేళ్ళయింది.

వేలెడంతలేని యీ కుర్రాడు నన్ను గుర్తుపట్టి, ఆ విషయా లన్నీ తెలిసినట్లు మాట్లాడుతున్నాడు—మీరు మళ్ళీ నిదా నంగా వాడితో మాట్లాడితే మీకే తెలుస్తుంది" అని చెప్పాడు రంగనాథం.

కామేశ్వర్రావు అరుగుమీద కూర్చున్నాడు. "ఇలా కూర్చోండి" అని సూరిని గురించి అన్నీ అడగడం మొద లెట్టాడు. ఇద్దరూ ఎంతోసేపు మాట్లాడుకున్న తర్వాత లేచి, గొడుగు పేటలోని డాక్టరు నారాయణరావుగారి యింటికి వెళ్ళారు.

♦ ♦ ♦ ♦

చాలా హడావుడిగా వుంది యిల్లంతా. గదిలో నారాయణ రావుగారే కాక, మరో ఇద్దరు డాక్టర్లున్నారు. సూరిని స్టూలుమీద కూర్చొబెట్టి మాటాడుతున్నారు. సావిట్లోకి వచ్చిన కొందరు పెద్దలని కూడా అక్కడే కూర్చొ పెట్టాడు కామేశ్వర్రావు. వంటింటి దగ్గర వీధిలోని ఆడవాళ్ళ కొందరు వచ్చి కూర్చున్నారు.

కాంతం అక్కడ ఆడవాళ్ళ దగ్గర నిలబడలేక, యిటు సూరి గదిలోపలికి వెళ్ళలేక తచ్చాడుతోంది.

"బెజవాడలో ఎక్కడ నీ దుకాణం?"

"ప్రసన్నా హోటలు బిల్డింగులో."

"ఒక్కడివేనా వ్యాపారం?"

"లేదు. నా పెద్దకొడుకు సాయం వుండేవాడు. పంథొమ్మిది వందల పదిహేనులో వచ్చాను చేను. తణుకు దగ్గర పల్లెటూరు మాది."

"నీకు పిల్లలు ఎంతమంది?"

"ఒక కొడుకు, యిద్దరు కూతుళ్ళు- కూతుళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేశాను. కోడలిదీ తణుకే.

"మనమలున్నారా?"

"ఒక్కడే కొడుక్కు పుట్టాడు. నా భార్యపేరు సావిత్రి."

ఏడేళ్ళ పసికంఠం వాడిది. ఆ కంఠంలోంచి యీ మాటలు వస్తోంటే విచిత్రంగా వుంది. కాంతానికి యిదంతా ఏదో చాలా అపనమ్మకంగా వుంది. కానీ వాడు కళ్ళార్ప కుండా డాక్టరుగారి వంకచూచి, మంత్రించినట్లుగా మాటాడు తున్నాడు.

"నువ్వు ఎప్పుడు చచ్చిపోయావు? పోయినప్పుడు ఎవరెవరున్నారు దగ్గర?"

కాంతం యీ ప్రశ్న వినలేకపోయింది. కళ్ళల్లోకి భయం వచ్చింది.

"నాకు అప్పుడు అరవైనాలుగేళ్ళు. పోయినప్పుడు ఎవరూ లేరు దగ్గర. సావిత్రి పెరట్లో పచ్చడి రుబ్బుతోంది.

నా కొడుకు దుకాణం నుంచీ రాలేదు. కోడలు గుళ్ళోకి వెళ్ళింది."

"నీకు అదంతా గుర్తుందా?"

"ఓ. దుకాణంలో కూర్చుని వుండగా తలనొప్పి వచ్చింది. సోడా త్రాగి యింటికి పోతానని అబ్బాయితో చెప్పాను. యింటికి వచ్చి, చాప వేసుకుని క్రిందపడుకున్నాను."

మధ్యాహ్నం పన్నెండువరకు మాటాడుతూనే వున్నాడు సూరి. వచ్చేపోయే జనానికి అంతులేదు. పన్నెండౌతుంటే స్టూలుమీదనుంచి దిగి క్రింద పడుకున్నాడు సూరి. అలసి పోయాడని డాక్టర్లు వదిలేశారు.

వాళ్ళంతా బయటకు వచ్చారు. రంగనాథం, కామేశ్వర్రావు వాళ్ళతోటే వచ్చారు. "బెజవాడ వెళ్ళి యివన్నీ వాకబు చేశాను. డాక్టరుగారూ! నాగభూషణం అనే బట్టల దుకాణం వాడు ఎనిమిదేళ్ళ క్రితం చచ్చిపోయాడండి, అంతా కరక్టే వీడు చెప్పేది" కామేశ్వర్రావు కంఠంలో ఒక ఉత్సాహం, ప్రాముఖ్యత ధ్వనిస్తున్నాయి.

"దొడ్లో దొండపాదు వుందని చెప్పాడు. సావిత్రికి ఆరుపేటల చంద్రహారం వుందనీ, అది ఎవరి దగ్గరో కొడుకు తాకట్టు పెట్టాడనీ చెప్పాడు. అదీ నిజమే."

నారాయణరావుగారు సాలోచనగా యితనివంక చూశారు. "పోనీ ఒకసారి బెజవాడ తీసుకెళ్ళి అన్నీ చూపించండి. నేను లక్నోకి వుత్తరం వ్రాసి వారమవుతోంది. జవాబు

రాగానే ఆలోచిద్దాం ఏంచేయాలని. మద్రాసుకి కూడా రాస్తాను పరిస్థితినిబట్టి" అన్నారాయన. ముగ్గురు డాక్టర్లూ కలిసి కారెక్కి వెళ్ళిపోయారు.

సూరి అక్కడే నిద్రపోతున్నాడు. ఆడవాళ్ళు, మగ వాళ్ళు గదిలోకి తొంగిచూసి, బయటకు వెడుతున్నారు. కాంతం వెళ్ళి వాడిని లేవదీసి బుజాన వేసుకుంది. బలవంతాన పీటమీద కూర్చోపెట్టి "నాన్నా! అన్నం తిందువుగాని. లే నాన్నా!" అని బుజ్జగించి లేపింది.

వాడు కళ్ళు తెరిచాడు. చుట్టూ చూశాడు. కాంతం వంక చూశాడు. బిగ్గరగా ఏడ్చాడు. కాంతం సముదాయించి, ఏడుస్తుండగానే అన్నం కలిపి పెట్టింది. వాడు ఎంత సేపటికో తేరుకుని అన్నం తిన్నాడు.

ఏదో పూనకం వచ్చినట్లు నీరసపడిపోయాడు బిడ్డ అని ఆరాటపడింది. ఎక్కడో ఎప్పుడో చావడమేమిటి, మళ్ళీ పుట్టడమేమిటి— వీడికేదో మంత్రంవేసి వాగిస్తున్నారని భయం పట్టుకుంది ఆమెకి. చూసిన కొద్దీ వాడు చిత్రంగా కాక, జబ్బుగా కనబడుతున్నాడు ఆమెకి.

ఆరాత్రి కామేశ్వర్రావు భార్యకి చెప్పాడు డాక్టరు నారాయణరావుగారు ఎవరో పెద్ద పెద్ద డాక్టర్లకి యీ కేసు గురించి వ్రాశారని. లక్నోనుంచి వచ్చే డాక్టర్ పరిమళ ఘోష్ అనే ఆయన వీలైతే ఇంగ్లాండుకకూడా వ్రాస్తారట.

పూర్వజన్మ జ్ఞానంవున్న పిల్లలని గురించి వాళ్ళు పరిశోధనలు చేస్తున్నారట.

"ఎందుకండీ యిదంతా? వాడికి తెలిసీ తెలియని విషయాలన్నీ ఎందుకండీ వాగిస్తారు?" అన్నది కాంతం వినీవిని.

"ఏడ్చినట్లే వుంది. అదృష్టం కొద్దీ వీడు మనింట్లో పుట్టాడు. ఎంత కలిసొస్తుందో తెలుసా? వాళ్ళంతా రానీ, అప్పుడు మరీ తిరుగుతారు యీ పేట వాళ్ళంతా మన చుట్టూ" అన్నాడు కామేశ్వర్రావు.

"డాక్టర్లు వస్తే ఎక్కడుంటారు? ఇదంతా ఖర్చు కాదూ?" అన్నదామె భయంగా.

"రహదారి బంగళాలో—మనకి ఖర్చేమిటి? మనకే వాళ్ళు ఎదురు యిస్తారు" అన్నాడు కామేశ్వర్రావు.

"మనకి ఎందుకు యిస్తారు?"

"మన పిల్లవాడితో మాటాడినందుకు. ఇదంతా ఒక స్పెషలు కేసు కాదటే! వాళ్ళకి ఇంగ్లండునుంచి లక్షలు వస్తాయి. నేను నారాయణరావుగారితో యీ విషయం ముందునుంచీ గట్టిగా చెబుతున్నాను. కోట్లజనానికి ఒక్కటి వస్తుందిట యిలాంటి కేసు..." అని చెప్పి, యింక ఎక్కువ వివరాలు ఆమెకు చెప్పదలచుకోక "పిల్లలు నిద్రపోయి నట్టున్నారే?" అన్నాడు.

సూరి, ఆ తర్వాత వెంకటేశు, చివరిది మాలతి. కాంతం వెళ్ళి సూరి ప్రక్కన చోటు చేసుకుని పడుకుంది.

తేలికగా వేగంగా వూపిరిపీలుస్తున్నాడు. చొక్కా బొడ్డు మీదకు పోయింది. వాడిని చూస్తోంటే ఏమిటో దిగులుగా అనిపించి, దగ్గరకు జరిగి పడుకుంది కాంతం.

✤ ✤ ✤ ✤

కామేశ్వర్రావు యింటికి రాగానే చెప్పాడు భార్యతో వాళ్ళు వచ్చారని. ఎర్రని దొరలు యిద్దరు, సన్నగా వున్న డాక్టరు ఒకాయన ముగ్గురు వచ్చారని. నారాయణరావుగారు వాళ్ళని కారులో రహదారి బంగళాలో దింపాడు. ఆయనే స్వహస్తాలతో వండించి భోజనాలు పంపిస్తానన్నాడట. ఒకపూట డి. ఎమ్. ఓ. పిలిచాడట.

"సూరికి పండక్కి కుట్టించిన కొత్త బట్టలు తొడుగు. ఇంటికివెళ్ళి అన్నీ ఏర్పాటు చేసుకుని కారు పంపిస్తానన్నారు నారాయణరావుగారు, వీడిని తీసుకెళ్ళాలి" అని హడావిడి పడ్డాడు కామేశ్వర్రావు. అరటిచెట్టు దగ్గర పాత బ్లేడుతో ఆడుతున్నాడు సూరి.

కాంతానికి భయంగా వుంది వీడికి మందులేం పోస్తారో, ఇంజెక్షన్లు పొడుస్తారోనని.

"నేను రాకూడదా?" అన్నదామె చివరికి వుండబట్టలేక. కామేశ్వర్రావు "ఇంకానయం" అన్నాడు. ఆమె

రెండు మూడుసార్లు అడిగింది. అసలు యిదంతా అబద్ధం అని వాళ్లు చెబుతారేమో విందామని. అతను ససేమిరా వద్దన్నాడు. అతను స్నానానికి వెళ్ళినప్పుడు గదిలో తగిలించిన చొక్కా జేబులోంచి నోట్లు కనబడ్డాయి కాంతానికి. ఎన్నో తీసి లెఖ్ఖ పెడదామనుకుందిగానీ అతను కేకలేస్తాడని భయం వేసింది.

ఎంత యిచ్చారో డబ్బు, ఏమి చేయమని యిచ్చారో— నిజంగానే వాళ్ళంతా నమ్ముతున్నారన్నమాట. వాళ్ళకి ఏదో ఉపయోగం వుండబట్టి యింతింత డబ్బుకూడా యిస్తున్నారు. ముందు ముందు యింక బాగా యివ్వవచ్చు. కష్టాలన్నీ గట్టెక్కే రోజులు వస్తాయి. కాంతానికి తన కొడుకు నేదో భూతం పట్టుకున్నదన్న భయం తొలగిపోసాగింది. క్రొత్తగా వస్తున్న యీ ఆదాయం ఆమె కంటికి ఆనుతోంది.

కామేశ్వరరావు అదరా బాదరా తింటున్నాడు. ఏమీ మాటాడ్డంలేదు. మంచి ఆలోచనలో వున్నట్టున్నాడు.

"డబ్బు ఎందుకిచ్చారు? వాడికి ఏమైనా కొనిపెట్టమని యిచ్చారా?" అన్నది.

కామేశ్వరరావు తినడం ఆపి ఆమె వంక చూశాడు. "తీశావా జేబులోంచి?" అన్నాడు. ఆమె లేదని తలాడించి "వాడికి పాపం శుభ్రమైన బట్టలు కుట్టించండి. చిన్న సైకిలు కొనిపెట్టండి" అన్నది, తన మనస్సులోని కోరిక దాచుకోలేక. తనూ వీలైతే ఏమైనా ఒక చీర కొనుక్కోవాలని వుంది.

కామేశ్వరరావు చికాగ్గా చూశాడు. "ఇదంతా నీ కనవసరం. అవతల నేను ఎన్నో సర్దుకోవాలి. గొడవ మొదలెట్టకు" అన్నాడు.

అయినా ఆమె వూరుకోలేకపోయింది. "ఎంతిచ్చారు? ఇంకా యిస్తామన్నారా?" అన్నది.

"అనవసరమని చెబుతుంటే నీక్కాదూ!" నాకు తెలియదా ఏం చేయాలో?" అన్నాడతను గట్టిగా.

"పోనీలెండి. మీ యిష్టం వచ్చినట్టు చేసుకోండి. పసివాడన్న ప్రేమ వుంటుందేమో అనుకున్నాను. వాడికిచ్చే డబ్బు మనం వాడుకోవడమేమిటి?" అన్నది.

కామేశ్వరరావు తినడం ఆపేశాడు, "నువ్వింక మాట్లాడ్డం ఆపవా?"

"నేను నోరు మూసుకున్నాను కాబట్టే మీ యిష్టం వచ్చినట్లు ఆడిస్తున్నారు వాడిని సంతలో "పశువుగా—"

కామేశ్వరరావు కంచంలో గ్లాసుడు నీళ్ళు దిమ్మరించి చేయి కడుక్కున్నాడు. లేచివెళ్ళిపోతోంటే కాంతం చూస్తూ కూర్చుందే కానీ, అదేమిటనలేదు. పోనీ ఓ పూట తిండి మానితే నష్టం లేదన్నట్టు వూరుకుంది.

కాస్సేపటికి సూరివచ్చి "మంచి బట్టలు తొడగమంటున్నాడే నాన్న" అనే వరకు కదల్లేదు. తెల్లచొక్కా గళ్ళ లాగూ తీసేసింది వాడికి. పండుగనాడు జీడీలు జేబుల్లో దాచు

కున్నాడేమో మరకలు జేబులకి. ఎక్కడికి వెడుతున్నామని వాడు అడగలేదు. మళ్ళీ ఎప్పుడొచ్చేదీ చెప్పలేదు కామేశ్వ రావు.

వాళ్ళు కారులో ఎక్కుతోంటే అక్కడే నిలబడింది కాంతం. కామేశ్వరరావు ఆమెతో ఒక్క మాట మాటాడ లేదు. పిల్లవాడిని చేయిపట్టుకుని తీసుకెళ్ళి కారులో ఎక్కాక ఏదో చెప్పాడు. సూరి కారు ఎక్కి గొప్ప ముఖంతో చెల్లి వంక, తమ్ముడి వంక చూశాడు.

ఇంట్లోకి వచ్చాక అన్నానికి కూర్చుంది కాంతం. ఏమీ సయించలేదు. ఎంతలేదన్నా యాభై రూపాయలు యిచ్చి వుంటారు వాళ్ళు. తడవ తడవకీ యిలానే యిస్తా రేమో. ఇక ముందు యిచ్చేది ఎల్లా నాశనం చేసుకున్నా, మొట్టమొదటిదైనా వాడికి చెందేట్లు చూడాలి. ఆ నీతి ఆయనకు లేదు. ఆపేక్ష, ముచ్చట అసలు లేవు. ఏవో ముద నష్టపు అప్పులు తీర్చుకుంటారు యీ డబ్బుతో. ఎన్ని దుకా ణాల్లో చేరి పద్దులు వ్రాసినా చేతినిండా రూపాయలు ఆడింది ఎప్పుడూ లేదు. ఇప్పుడు తన కడుపున పుట్టిన పిల్ల వాడి పుణ్యమా అని యిన్ని రూపాయలు ఒకసారి కన బడ్డాయి. కారులో ఎక్కి దర్జాగా తిరుగుతున్నాడు. ఏదో దశ అందుకుంది.

వాళ్ళు వచ్చేటప్పటికి చీకటిపడింది. నారాయణరావు గారూకూడా వచ్చారు. కాంతం ఆయనకు ఎదురు పడలేదు

ఎప్పుడూ. కానీ గబగబా వెళ్ళి సూరిని ఎత్తుకుంది. వాడి చేతిలో బిస్కట్లున్నాయి. "కారులోనే నిద్రపోయాడు కాస్సేపు పడుకోబెట్టండి" అన్నాడు ఆయన.

లోపలికి తీసుకెళ్ళి పడుకోబెట్టింది. చేతిలో బిస్కట్లు పెట్టినట్టున్నారు. కామేశ్వర్రావు చేతిలో ఒక కొత్త సంచీ ఉన్నది. అందులో ఏమున్నాయో, యింకా ఎంత డబ్బిచ్చాడో?

"నేను వస్తానండి, రేపొద్దున కనబడండి" అని డాక్టరు వెళ్ళిపోబోతుంటే— "రేపు వీడినికూడా తీసికెళ్ళాలా?" అని అడిగాడు కామేశ్వర్రావు.

"సరే, వాడు లేకపోతే మనమెందుకు? వాళ్ళకి నమ్మకంగానే కనబడుతోంది. నాగభూషణం చచ్చిపోయిన టైముకి, వీడు పుట్టిన టైముకి వ్యవధికూడా సరిగ్గా వుంది. బెజవాడకి వీడిని తీసుకెళ్ళి, అవన్నీ చూపించి పరీక్షిస్తారు. ఆ తర్వాత లక్నోకి తీసుకెళ్ళాలని వాళ్ళ ఐడియా" అన్నాడాయన.

"వాళ్ళేమంటారు? ఇలా అందరికీ గుర్తుండవేమి పూర్వజన్మ విషయాలు?"

"అందరికీ వుండవు కనకే నీ కొడుకుమీద వేల రూపాయలు ఖర్చుపెట్టి, మానసిక పరిశోధన చేయడానికి యింత దూరం వచ్చారు వాళ్ళు. బెజవాడ వెడితే ఒకడూ

వుంటాడా. రాత్రికి ఆగిపోవలసివస్తుందేమో...” అన్నారు డాక్టరుగారు.

“అక్కర్లేదులెండి. వాడే వుంటాడు” అన్నాడు కామేశ్వర్రావు.

కాంతానికి కష్టమనిపించింది. “ఒక్కడూ వుండడు డాక్టరుగారూ. అన్నంకూడా కలుపుకుని తినలేడు” అని తలుపు వెనక తచ్చాడుతున్నది కాస్తా ముందుకు వచ్చింది.

కామేశ్వర్రావు చిరాకు పడిపోయాడు. “నిన్నెవరూ సలహా అడగలేదు. లోపలికి వెళ్ళి పనిచూసుకో” అన్నాడు.

“ఒక్కడినీ మీతో తీసుకెడతా నంటే విన్నాను కాబట్టి చెప్పడానికి వచ్చాను. వాడు వుండలేడు, అసలు నాకూ్కడా అన్ని విషయాలు చెప్పాలి. పసివాడిని అన్యాయం చేసి వాడి సొమ్ము వాడుకోరాదు మనం. మీరైనా చెప్పండి” అన్నది డాక్టరుగారితో గబగబ.

“మనం అవతల మాట్లాడుకుందాం పదండి డాక్టరు గారూ!” అన్నాడు కామేశ్వర్రావు.

ఆయన ఎటూ అనలేక “మంచిదమ్మా, అన్నీ చెబుతానులెండి నేను” అని తలవంచుకుని బయటికి నడిచాడు.

ఆమె కాస్సేపటికి గదిలోకి వెళ్ళేసరికి సూరి లేచి కూర్చుని వున్నాడు. బద్ధకంగా ఆవలించి గోడన జేరగిల బడ్డాడు. వాడి ప్రక్కన కూర్చుని “వాళ్ళు నీకు ఏమిచ్చా

రుగా!" అన్నది. వాడు కళ్ళు వాల్చి "బిస్కట్లు- పెద్ద పొట్లం యిచ్చారు. నాన్న సంచీ ఏదీ?" అన్నాడు.

"ఉన్నాయి, యిస్తాలే. నాన్నగారికి ఏమిచ్చారు. చూశావా?" అన్నది కాంతం ఆత్రంగా.

"డబ్బులిచ్చారు. చాలా యిచ్చారు" అన్నాడు సూరి. కాంతానికి గుండెల్లో గుబుక్కుమంది. ఈయన బయటికి వెళ్ళాడు జేబులో అది పెట్టుకుని. నాశనం చేస్తాడు పాడు ఖర్చులన్నీ పెడతాడు.

"నిన్ను ఏమని అడిగారు? మళ్ళా అప్పటివన్నీ అడిగారా?"

సూరి మాట్లాడక కళ్ళు మూసుకున్నాడు. తన దగ్గర ఆ మాటలేమీ చెప్పడు, ఎంత అడిగినా ఏమో అంటాడు. మరి ఆ డాక్టర్లు ఏమి మందు వేస్తారో, ఎన్నో వాగుతాడు. తనకీ నమ్మక తప్పడంలేదు.

"ఏమి అడిగార్రా? ఎవరెవరు వున్నారక్కడ?"

"దొరగారు, యింకా- మళ్ళీ- యిద్దరు మరేమో డాక్టరుగారు."

"ఏమి అడిగారు నిన్ను, ఏం చెప్పావు?"

వాడు తలుపువేపు చూస్తున్నాడు. మళ్ళీ అడిగింది కాంతం. "ఏమో!" అన్నాడు. అంతా మర్చిపోయినట్టుంటాడు. తను అడిగితే చెప్పడు. ఇష్టమైనప్పుడు ఏదో ఒక మాట అంటాడు.

"ఆకలేస్తోందా? రా, అన్నం తిందువు గాని—"

"వద్దు. రంగుసోడా యిచ్చారు. పెద్ద చాక్లెట్లు యిచ్చారు. అన్నీ తిన్నా" అన్నాడు.

"రా నాన్న, పొట్ట ఏమవుతోంది చూడు" అని వాడిని తీసికెళ్ళి ఇంత వుప్పు దిష్టితీసి పడేసింది. కంచంలో అన్నం పెట్టి పులుసుపోసి కలిపి బలవంతాన నాలుగు ముద్దలు తినిపించింది. వాడు ఎక్కువైందని గోలచేశాక మూతి తుడిచి మంచి నీళ్ళు పట్టింది. తమ్ముడితో చెల్లాయితో ఆడుకున్నాడుగానీ మాటలు ఏమీ లేవు.

బాగా ప్రొద్దుపోయాక వచ్చాడు, కామేశ్వరావు. ఎనిమిదే అయిందో, తొమ్మిదో అయిందో, అతను బట్టలు మార్చి పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కుని వచ్చాడు. ఇంకా అలాగే పడుకుంది కదలకుండా పిల్లల పక్కన. అతను ఒక చాప, తలగడ తీసుకుని వీధి అరుగుమీద వేసుకున్నాడు. చాలా కోపంమీద వున్నాడు.

నా కెందుకసు వూరుకుంటే మరీ ముదురుతుంది వ్యవహారం అని లేచి వెళ్ళింది. చొక్కా కూడా మేకుకి లేదు. విప్పి తలక్రిందే పెట్టుకున్నాడు.

ఆమె వీధి గుమ్మం దగ్గరకు వెళ్ళింది. వీధంతా నిర్మానుష్యంగా వుంది. అరుగుమీద కూలబడి, "ఏమండీ, అన్నం తినరా?" అన్నది. అతను మాటాడలేదు.

"లేవండి. పిల్లలు తిని పడుకున్నారు. మీకు పెట్టాక నేను తిని యిల్లు కడుక్కోవాలి."

"ఇల్లు కడుక్కోపో."

"అదేమిటి మీరు తినివచ్చారా ఎక్కడేనా?"

"ఆ— తిన్నానులే చీవాట్లు" కొంచెం ఆగి "నువ్వీక అవతలికిపో, నాతో మాట్లాడొద్దు. నన్ను పలకరించొద్దు" అన్నాడు కోపంగా.

"ఎందుకంత గట్టిగా అరుస్తారు? నలుగురూ మూగుతారు కూడాను" అన్నదామె తనూ కంఠం రెట్టించి.

అతను లేచి కూర్చున్నాడు. "మూగితే మూగనీ, నాకేం భయమా? నువ్వు చేసిన బజారుచాలు. వూళ్ళో అందరితో పోయి చెప్పకపోయావు మొగుడు వుత్తి డబ్బు వెధవ అని."

"నేనిప్పుడు ఎవరితో చెప్పాను?"

"చెప్పలేదా? ఇంకా ఎవరితో చెప్పాలి! నారాయణ రావుగారితో మాట్లాడే అవసరం నీకేమొచ్చింది? ఇంట్లో పడుండవలసిన దానివి అసలు యివతలికి వచ్చి ఎందుకు నోరెత్తాలి?" అతను కంఠం హెచ్చిస్తోంటే ఆమెకు కోపం వచ్చేసింది.

"ఆయనతో చెప్పుకుంటేనన్నా మీకు కొంచెం యింగితజ్ఞానం వస్తుందని చెప్పాను. అసలు యిదంతా నాటకం. నా బిడ్డకి ఏమీ తెలియదు. మీరు వాగించినదల్లా

వాగుతున్నాడు. పసివాడిని అన్యాయంచేసి వాడికేదో గ్రహం పట్టించి డబ్బు పోగుచేసి మింగాలని..." ఆమె మాట పూర్తి కాకముందే కామేశ్వర్రావు లేచి ఆమెను రెండు దెబ్బలు వేశాడు. ఆమె బిగ్గరగా ఏడ్చింది. తిట్టింది. మరో నాలుగు దెబ్బలు కోపంమీద వేసేసరికి ఆమె లేచి గభాలున యింట్లోకి వెళ్ళింది.

వెళ్ళి పిల్లల పక్కన పడుకుంది. వళ్ళు విపరీతంగా మంటపుడుతోంది. ఉక్రోషం, అవమానం, దుఃఖం లోపల నుంచి జ్వాలలుగా వీస్తున్నాయి. ఏడుపుకంటే ఎక్కువగా కోపం వస్తోంది. మాలతి పుట్టిన తర్వాత ఎన్నడూలేనిది యీవేళ చేయిచేసుకున్నాడతను కడుపులో ఆకలి మంటగా లేస్తోంటే, పిల్లలకి దగ్గరగా జరిగింది. సూరి ప్రక్కకుచేరి వాణ్ని దగ్గరకు అదుముకుంది వెచ్చని వూపిరి ఆవిరిగావచ్చి, తనవెంట ధారగా కన్నీటిని తీసుకొచ్చింది.

తను ఏమి బావుకుందామని పోట్లాడింది? ఏ దెయ్యమో పట్టుకుని పసివాడిని పీడిస్తోందని మొదట ఎంత భయపడింది. తాయెత్తు కూడా కట్టించింది. ఇప్పుడు ఆ భయంపోయి, ఏదో బిడ్డపేరున నాలుగురాళ్ళు వస్తున్నాయని సంతోష పడింది. అంతేగా? ఆకారంలేని ప్రాణిగా తనలో కదిలాడు ఒకనాడు, ముడుచుకొన్న మాంసం ముద్దగా తన వూపిరే వాడి ప్రాణంగా జీవం పుంజుకొన్నాడు. తనలో ఎగిరి గంతు లేసి, ఎగసిపడి తన కోర్కెలన్నీ చెప్పుకోవాలని, తన

వ్యక్తిత్వం నిలుపుకోవాలని యత్నం చేశాడు. నిస్సహాయమైన శిశువుగా, తన కళ్ళల్లోకి విశ్వాసంతో, నమ్మకంతో, ఏ దాపరికాలులేని జేలతనంతో చూశాడు. అటువంటి పసిబిడ్డ సూరి కాడా వీడు? ఎక్కడో వీడికి బాంధవ్యాలున్నాయి అంటున్నారు. అక్కడికే చెందిన జీవితం వీడి మనస్సులో మెదులుతోంది- అంటున్నారు. అదంతా తవ్వి, తీసి, భయం కలిగించే ఆ మాటలు మాట్లాడి స్తే కానీ వాళ్ళెవరికీ తోచదు. అదంతా మర్చిపోయి తన బిడ్డగా ఎప్పుడుంటాడు?

తనకి కాకుండాపోతున్న ఆ బిడ్డని గట్టిగా దగ్గరకు అదుముకొని, ఏదో బరువైన ఆపేక్ష కడుపులోని ఖాళీని నింపుతోంటే, కళ్ళు మూసుకుంది ఆ కన్నతల్లి.

—సాయంత్రమైపోతోంది. మూడురోజుల క్రితం బెజవాడ వెళ్ళినవాళ్ళు యింకా రాలేదు. ఆ రోజు యిలా వూరికి వెడతామని కూడా చెప్పకుండా కారులో వాడిని ఎక్కించుకుని వెళ్ళిపోయారు. డాక్టరుగారి ఆసుపత్రికి తను మనుషుల్ని పంపి స్తే తెలిసింది. దీపాలు వెలిగించాలని లేక అలాగే కూర్చుంది కాంతం. వాడు అన్నం తిన్నాడో లేదో, ఎక్కడ తిప్పుతున్నారో, ఎవరికి చూపిస్తున్నారో ఏమేమివాగిస్తున్నారో ఎప్పుడూ తనని విడిచిపెట్టి వుండలేదు వాడు. కారుఎక్కి- ఎక్కడికో వెడతానన్న సంబరంలో వాడికది తెలియలేదు.

ఆయనకీ, డాక్టర్లకీ ఏం తెలుస్తుంది? పిచ్చినాన్న. దాహంవేస్తే కూడా తెలుసుకోక అలా నోట్లో వేలు వేసు కుంటాడు. ఆ చచ్చిపోయిన నాగభూషణం యిల్లు, వాకిలీ, కొడుకూ, కోడల్ని అందరినీ చూపిస్తారు కాబోలు. పూర్వ జన్మ జ్ఞానంవల్లనే వీడిలా మాటాడుతున్నాడని ఖాయపరచు కుంటారు. అక్కడి నుంచి ఎక్కడికేనా తీసుకుపోయారేమో!

ఈ క్షణాన సూరి వచ్చి తన కెదురుగా నిలబడితే వాడిని గట్టిగా పట్టుకుని తన ఒళ్ళో పడుకోబెట్టుకుని ఎవ రొచ్చినా వదలదు తను. ఆ పెద్ద డాక్టర్లు ఒక డబ్బుమూట పడేస్తారు యీాయనకి. తనకి ఏమీావద్దు. పిల్లవాడు కళ్ళెదురుగా వుంటేచాలు. బుద్ధిలేక తను డబ్బుకోసం పోట్లాడింది.

అలా కూర్చున్న కొద్దీ, ఆలోచించిన కొద్దీ కడుపులో ఖాళీ ఎక్కువవుతున్నట్టనిపించింది. నాలుగురోజులు కాదు, నలభై సంవత్సరాలైనట్టుంది వాడిని చూచి. దుఃఖం ముంచు కొచ్చింది. నల్లగా, కాఱునల్లగా వున్న మేఘాలు వున్నట్టుండి క్రమ్ముకొని, ప్రపంచమంతా చల్లబడిపోయినట్టు, దిగులైన పెద్దవాన కురిసినట్టు వున్నది ఆమె మనస్సు.

చిన్నపిల్లలిద్దరూ ప్రొద్దుటి అన్నం తిన్నారు. ఎదురుగా వున్న యీా పసివాళ్ళిద్దరూ ఆమె కంటికి ఆనడము లేదు. అన్నయ్య రాలేదేం అని వాళ్ళు అడిగితే, పట్టలేకపోతోంది కాంతం.

రాత్రి పెద్దదవుతోంది. ప్రక్కవారింటి గడియారం రాత్రి కొట్టే గంటలన్నీ వినబడ్డాయి. కూర్చుని కూర్చుని ఎప్పుడు ఒరిగిందోగానీ ఛళ్ళున తెల్లవారినట్టు కళ్ళకి తెలిసి లేచిందామె.

అప్పుడు వచ్చారు వాళ్ళు. కారు ఆగింది, ఆయన వచ్చారు, డాక్టరు వచ్చారు. డ్రైవరు ఏవో వస్తువులు తెచ్చి లోపల పెట్టాడు. సూరి రాలేదు. సూరి రాలేదు!

"ఏమండీ, సూరి ఏడీ?" ఎంతో గట్టిగా అడిగాననుకున్నది కాంతం. ఏమపుగా పైకివచ్చిన స్వరంలో ఆ మాటలు వినబడడం లేదు.

"వెళ్ళాడు, వస్తాడు" అన్నాడతను. డాక్టరుగారు ముందుకువచ్చి చెప్పారు. వాడిని బొంబాయి తీసుకెళ్ళారుట. ఆ తర్వాత ఎక్కడికైనా తీసుకువెళ్ళవచ్చుట. మళ్ళీ పంపేస్తామన్నారుట. చాలా మృదువుగా నట్టుతున్నట్టుగా మాటలు పలుకుతూ చెప్పారాయన. కాంతానికి అర్థమైంది చివరికి. సూరిని యిచ్చేశారు. డాక్టర్ల సరదాకోసం, శాస్త్ర విజ్ఞానం పెరగటం కోసం వాడిని అప్పగించి, చేతులూపుకుంటూ వచ్చారు.

కాంతం ఆయన మాటలు వినక, అర్థం చేసుకోక కారు దగ్గరకు పరుగెత్తింది. పరుగెత్తలేక కిందపడి ఏడిచి, ఏడవలేక గుండెలు పగలకొట్టుకుంది.

◆ ◆ ◆ ◆

ఎన్నో రోజులు గడిచాయి. ఆకాశమార్గాన విమానమెక్కి వెళ్ళిన సూరి అటే వెళ్ళిపోయాడింక. బందరు ఆకాశం మీద విమానం ఎప్పుడోగానీ ఎగరదు. వెంకటేశుకి, మాలతికి ఆ చప్పుడు వింటే సంబరం. బెజవాడలో చచ్చిపోయిన నాగభూషణం మళ్ళీ పుట్టి తన కడుపులో పెట్టిన చిచ్చు యింకా రగులుతుంటే, చెవులు రిక్కించి ఆ విమానం చప్పుడు వింటుంది కాంతం. అమ్మ పెట్టే పప్పు బువ్వలు మాత్రం తెలిసిన సూరి పెద్ద ప్రపంచంలో బ్రతకలేకపోయాడన్న వార్త ఆమెవరికూ రానేలేదు.